క్లుప్తంగా

వృద్ధులు, దివ్యాంగులను ఆదుకోవాలి



నగరంపాలెం: వయోవృద్ధులు, దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని గిరిధారి మిత్ర మండలి అధ్యక్షులు బవిరిశెట్టి శ్రీనివాసరావు కోరారు. కొత్తపేట సోమువారివీధిలోని మండలి కార్యాలయంలో ఆదివారం వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరూ ఉండి కూడా చాలా మంది ఒంటరిగా ఉండిపోతు న్నారని అన్నారు. అటువంటి వారికి మానవత్వంతో సహాయం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి పలకలూరు శివరావు, కోశాధికారి దిండు రాజశేఖర్, సభ్యులు జుజ్జూరు శివకుమార్, పబ్బిశెట్టి సంజీవరావు, గార్లపాటి రోశయ్య, పీఎస్ఆర్.గుప్తా, సింగంశెట్టి ఆంజనేయులు పాల్గొనగా, సంస్థ తరపున సేవలందిస్తున్న కార్యదర్శి పలకలూరి శివరావుని సత్కరించారు.

నేడు ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్ నందు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నేడు జరుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ప్రజలు తమ స్థానిక సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని చెప్పారు.

అలరించిన హాస్యవల్లరి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళ్యాణవేదికపై ఆదివారం రాత్రి గుంటూరు హ్యూమర్ క్లబ్ 115వ హాస్యవల్లరి నిర్వహించారు. ప్రముఖ హాస్య నటులు జెన్నీ, క్లబ్ కార్యదర్శి షేక్.లాల్‌వజీర్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. సభకు జంపని కిశోర్‌బాబు అధ్యక్షత వహించారు. అనంతరం మల్లాద క్రియేషన్స్(హైదరాబాద్) ఆధ్వర్యంలో మల్లాది రవికిరణ్ రచన, మల్లాది భాస్కర దర్శకత్వం వహించిన 'చీకట్లో చంద్రుడు' నాటికను ప్రదర్శించారు. నాటికలో మల్లాది భాస్కర్, తేజోమూర్తుల మురళీధర్, ఆకెళ్ళ గోపాలకృష్ణ, శ్రీనివాస నాయుడు, జీఎస్ చలపతి, అర్జున్, బీవీ రావు పాత్రల్లో నటించారు. నాటిక ప్రేక్షకులను అలరించింది. కార్యక్రమంలో సినీ, టీవీ నటులు ఉమ్మనేని వీరయ్యచౌదరి, ఆలయ సహాయ కార్య దర్శి ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కుల వ్యవస్థను నిలబెట్టడమే సనాతన వాదం



నగరంపాలెం: సనాతన వాదమంటే కూలిపోతున్న కుల వ్యవస్థను తిరిగి నిలబెట్టడమేనని విరసం సీనియర్ నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాషువా పూలే పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బ్రాడీపేట యూటీఎఫ్ హాలులో సనాతన ధర్మం- రాజ్యాంగం అనే అంశంపై సభ నిర్వహించారు. సభకు కవి, జర్నలిస్ట్ బి.విల్సన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ సనాతన ధర్మం ప్రకారం స్త్రీని అత్యంత తక్కువ స్థాయిలో ఉంచడమేనని అన్నారు. ప్రస్తుత సమాజంలో అన్ని రంగాల్లో మహిళలు దూసుకెళ్తున్నారని తెలిపారు. మతాలు మనుషుల్ని సంస్కరించాలే తప్ప ఒక మతంపై మరో మతం దాడులు చేయడం సరికాదన్నారు. సనాతన ధర్మాన్ని ప్రస్తుతం రాజకీయాలకు వాడుకుంటున్నారని విమర్శించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడారు. సభలో బహుజన్ పొలిటికల్ సెంటర్ నాయకులు సాదు మాల్యాద్రి, సీనియర్ న్యాయవాది వైకె, వీసీకే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె.జయసుధ, సామాజిక కార్యకర్త కనకవల్లి వినయ్, కవి, నాటక ప్రయోక్త దేవరపల్లి ప్రభుదాస్, మాల మహానాడు నాయకులు బత్తుల అనిల్ బాబు, రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు ఈరి రాజశేఖర్, మేడద బాబూరావు, బి.కె.రావు, బండారు దేవరాజు పాల్గొన్నారు.

నేడు ఢిల్లీకి వెళ్లనున్న కమిషనర్

నెహ్రూనగర్: అంతర్జాతీయ వర్క్ షాపునకు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం వెళ్లనున్నారు. అర్బన్ ల్యాండ్ రికార్డ్ కోసం సర్వే, రీ సర్వేలో ఆధునిక సాంకేతిక విధానాల అమలుపై ఈ నెల 21, 22 తేదీల్లో న్యూఢిల్లీలోని అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వర్క్ షాపులో పాల్గొంటారు. కేంద్ర ప్రభుత్వ భూ వనరులు, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్, పట్టణ నివాసాల ఆధారిత భూమి సర్వేలో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుంచి కుప్పం, మంగళగిరి- తాడేపల్లి, గుంటూరు, ఒంగోలు, ఏలూరు, కాకినాడ, తిరుపతి, అనంతపురం మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల కమిషనర్లు పాల్గొననున్నారు.

ఎక్కడి పనులు అక్కడే..

● నత్తేనయం ● నిలిచిన ఏటీ అగ్రహారం విస్తరణ పనులు

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శరవేగంగా పనులు
- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రజలకు అవస్థలు
- ఎమ్మెల్యే అయిన తరువాత రోడ్డువైపే చూడని గల్లా మాధవి
- 80 అడుగుల రోడ్డుగా నిర్మాణం చేపట్టిన గత ప్రభుత్వం



ఏటీ అగ్రహారం మెయిన్‌రోడ్డులో గత ప్రభుత్వం పూర్తి చేసిన రోడ్డు, డివైడర్ నిర్మాణాలు



ఏటీ అగ్రహారం 7వ లైను నుంచి కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిలిచిన విస్తరణ పనులు




మెయిన్‌రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోవడంతో అధ్వానంగా మారిన రోడ్డు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డు విస్తరణ పనులు అటకెక్కాయి. పెరుగుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో విస్తరణకు శ్రీకారం చుట్టారు. పశ్చిమ నియోజకవర్గంలోని ప్రధాన ప్రాంతాల్లో ఒకటైన ఆనంద తీర్థ(ఏటీ) అగ్రహారం మెయిన్‌రోడ్డును 80 అడుగుల ప్రధాన రహదారిగా విస్తరిస్తూ గుంటూరు నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. జీరో లైను నుంచి చుట్టుగుంట సెంటర్ వరకు 1.2 కిలోమీటర్ల మేరకు 80 అడుగుల రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన గత ప్రభుత్వం సగానికిపైగా పనులు పూర్తి చేసింది. కాలువలు, డివైడర్ నిర్మాణం కాకుండా రూ.5.6 కోట్లను రహదారి నిర్మాణ పనులకే కేటాయించారు. విస్తరణకు అడ్డుగా ఉన్న 208 నిర్మాణాలను తొలగించాలని నోటిసై చేసిన అధికారులు భవన యజమానులను ఒప్పించి, నిర్మాణ పనులు చేపట్టారు. వారిలో కోర్టులకు వెళ్లిన వారి సమస్యలను పరిష్కరిస్తూ వచ్చారు. అయితే ఇదంతా గతం. చుట్టుగుంట సెంటర్ నుంచి ఎస్‌కేబీఎం నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల వరకు రెండు లైన్ల గ్రావెల్‌రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో పాటు డివైడర్‌ను నిర్మించారు. ఏడో లైను నుంచి జీరో లైను వరకు రోడ్డు విస్తరణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్, కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో రోడ్డు నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది.

అటువైపు కన్నెత్తి చూడని గల్లా మాధవి

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో కేవలం 15 నెలల కాలంలోనే 50 శాతానికిపైగా పూర్తి చేసింది. అయితే విస్తరణ పనులను ప్రభుత్వం జాప్యం చేస్తోందని గత ఎన్నికల సమయంలో రాజకీయ ఆరోపణలు చేసిన గల్లా మాధవి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ఇటువైపు కన్నెత్తి చూడలేదు. ఎన్నికల్లో లబ్ధి కోసం రాజకీయ ఆరోపణలు చేసిన మాధవి, ఎమ్మెల్యేగా గెలిచాక ప్రజలకు అండగా నిలబడి, రోడ్డు విస్తరణ పనులపై దృష్టి సారించిన దాఖలాలు లేవు.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం..



కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. గల్లా మాధవి ఎమ్మెల్యే అయిన తరువాత రోడ్డు గురించి పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో పనులు చకచకా చేశారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగింది. ఏటీ అగ్రహారం మెయిన్‌రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయడం ద్వారా 50 వేల మంది ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరే అవకాశం ఉంది. ప్రజలకు ఏదో చేస్తామని హామీలు గుప్పించిన కూటమి నేతలు రోడ్డు విస్తరణపై దృష్టి సారించాలి.

–అచ్చాల వెంకటరెడ్డి,
30వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్

నేడు ట్రాఫిక్ మళ్లింపు

ఎస్పీ సతీష్‌కుమార్



నగరంపాలెం: అమరవీరుల స్థూపం వద్ద సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి కార్యక్రమం పూర్తి వరకు కొనసాగుతుందని అన్నారు.పట్టాభిపురం నుంచి కంకరగుంట రైల్వే ఓవర్‌బ్రిడ్జి మీదగా నగరంపాలెం మూడు బొమ్మల కూడలి(రమేష్ ఆస్పత్రి) వైపుగా వెళ్లే వాహనాలన్నీ కలెక్టరేట్ జంక్షన్ వద్ద కుడివైపుగా తిరిగి కలెక్టర్ బంగ్లా రోడ్డు మీదగా వెళ్లాలి. వయా గుంటూరు మెడికల్ కళాశాల వైపుగా వచ్చే వాహనదారులు అంకమ్మతల్లి గుడి వద్ద ఎడమ వైపు వెళ్లాలి. అక్కడ్నుంచి సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఇంటి వైపుగా కన్నవారితోట రోడ్డులోని వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్దకు చేరుకోవాలి. ఇక నగరంపాలెం మూడు బొమ్మల కూడలి వైపు లేదా కలెక్టరేట్ రోడ్డు వైపు వెళ్లాలి. ఎంటీబీ కూడలి(రమేష్ ఆస్పత్రి) నుంచి వచ్చే వాహనదారులు కలెక్టరేట్, కంకరగుంట రైల్వే గేటు ఓవర్‌బ్రిడ్జి వైపు యథావిధిగా వెళ్లాలి. జిల్లా కోర్టు, సిబ్బంది, న్యాయవాదులు కోర్టు గేటు నంబర్- 2 ద్వారా లోపలికి వెళ్లాలి. ఐటీసీ కార్నర్ వైపు నుంచి నగరంపాలెం పోలీస్‌స్టేషన్ మీదగా వచ్చే వాహనదారులు కలెక్టరేట్ కార్యాలయం రోడ్డు, కంకరగుంట రైల్వేఓవర్‌బ్రిడ్జి మీదగా వెళ్లి సహకరించాలని జిల్లా ఎస్పీ తెలిపారు. భారీ వాహనాలకు అనుమతి లేదని అన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఆపసోపాలు

ఆటోలతో మరింత ఇబ్బందులు

- ఎక్కడబడితే అక్కడ నిలిపివేస్తున్న వైనం
- ఆస్పత్రులు ఉన్న ప్రాంతాల్లో ఇదే పరిస్థితి
- పోలీసులు చర్యలు తీసుకుంటున్నా.. మార్పు రాని పరిస్థితి



ఆర్టీసీ బస్టాండ్ వద్ద రోడ్డుపై అడ్డంగా నిలబెట్టిన ప్రైవేట్ బస్సులు



ట్రాఫిక్ స్టేషన్ ఎదుట అడ్డంగా పెట్టిన బారికేడ్లు

నగరంలో...	
ఆటోలు	26 వేలు
బైకులు	3.50 లక్షలు
కార్లు, జీపులు	50వేలు

పట్నంబజారు: నగరంలో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. అధికారులు ఎన్ని సమావేశాలు పెట్టినా.. ఎన్నిసార్లు అవగాహన సదస్సులు నిర్వహించినా.. వాహనదారుల్లో మార్పు రాని పరిస్థితి. వీటికి తోడు ముఖ్యంగా ఆటోలు, సిటీ బస్సులు, ప్రైవేట్ ట్రావెల్స్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరు ట్రాఫిక్‌కు మరింత తంటాలు తెచ్చిపెడుతోంది.

సమస్య ఎక్కడెక్కడంటే..

గుంటూరు నగరంలో ప్రధానంగా ట్రాఫిక్‌కు ఆటోలు కారణమవుతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్, ఓల్డ్‌క్లబ్ రోడ్డు చివర, నందివెలుగురోడ్డు బస్టాండ్ వెనుక, బ్రహ్మానందరెడ్డి స్టేడియం, రాధాకృష్ణా థియేటర్ సెంటర్(ఆర్కేటీ), హిమని కూల్‌డ్రింక్ సెంటర్, రైల్వేస్టేషన్, నాజ్‌సెంటర్, శంకర్ విలాస్, ప్రభుత్వాస్పత్రితో ప్రాంతాల్లో ఆటోలను అడ్డదిడ్డంగా నిలపటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పల్నాడు బస్టాండ్ సెంటర్‌లో అయితే ఇక చెప్పాల్సిన పనిలేదు. వన్ వే ఉన్నప్పటికీ ఏ మాత్రం పట్టించుకోకుండా ఆటోలు, సిటీ బస్సులు రోడ్డుపై అడ్డంగా నిలపటంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

అడుగుతీసి అడుగువేయాలంటే...

ఆర్టీసీ బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్ వెళ్లే రోడ్డులో వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. అంబులెన్స్‌లు కూడా వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. పట్నంబజారు, ఏలూరు బజారు, పూల మార్కెట్ సెంటర్, పండ్ల వ్యాపారాల సముదాయాలు, చేపల మార్కెట్ ప్రాంతాల్లో సరకు దించేందుకు వచ్చిన వాహనాలు రోడ్డులపైనే అడ్డంగా నిలిపివేయటంతో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడింది. సాయంత్రం వేళల్లో ఈస్ట్ ట్రాఫిక్ స్టేషన్ పక్కన, బస్టాండ్ వద్ద నేరుగా ప్రైవేట్ బస్సులను రోడ్డుపై నిలిపేస్తున్నారు. ఇదేమని అధికారులను అడిగితే.. నోటీసులు ఇచ్చామని చెప్పి చేతులు దులుపుకుంటున్నారే తప్ప.. సమస్య పరిష్కారానికి దృష్టి సారించడం లేదు.

ఆస్పత్రుల ప్రాంతంలో రద్దీ....

నిత్యం వేలాది మంది నగరంలోని ఓల్డ్ క్లబ్ రోడ్డు, అరవై అడుగుల రోడ్డు ప్రాంతాల్లో ఉన్నా ఆస్పత్రులకు రోగులు వస్తున్నారు. ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలు సెల్లార్‌లను వారి స్వప్రయోజనాలకు వాడుకుంటున్న పరిస్థితుల్లో, ఆస్పత్రులకు వచ్చిన రోగుల బంధువులు, ఇతరత్రా వ్యక్తులు వాహనాలను రోడ్డుపైనే పార్క్ చేస్తున్నారు.

పార్కింగ్ పరేషాన్...?

నగరంలో ట్రాఫిక్ సమస్య ఒక ఎత్తు అయితే.. పార్కింగ్ మరో సమస్య. ఓల్డ్‌క్లబ్‌రోడ్డు, 60 అడుగుల రోడ్డుల్లో రోడ్లపైనే కార్లు నిలిపేస్తున్నారు. ట్రాఫిక్ సిబ్బంది నో పార్కింగ్ వాహనాలు, రోడ్డుకు అడ్డంగా పెట్టిన వాహనాలకు జరిమానాలు విధిస్తున్నా కనీసం వాహన చోదకుల్లో మార్పు రావడం లేదు. నాజ్‌సెంటర్ మాత్రం ఒక షాపింగ్‌మాల్ యాజమాన్యం వాహనాలకు టోకెన్లు పెడుతున్న పరిస్థితుల్లో.. బయట పార్కింగ్ చేస్తే.. 'నో పార్కింగ్' కింద జరిమానాలు విధిస్తున్నారు. నగరంపాలెంలోని ఐటీసీ వద్ద ఉన్న ఒక షాపింగ్ మాల్ వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. వినియోగదారులకు షాపింగ్ మాల్స్ యాజమాన్యాలు ఫ్రీ పార్కింగ్ కల్పించాలని అధికారులు నెత్తినోరు కొట్టుకుని చెప్పినప్పటికీ ఏ ఒక్కరూ పట్టించుకోవటంలేదు.

చర్యలు తీసుకుంటాం



ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటాం. ఆటోల నియంత్రణకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే అవగాహన సదస్సులు నిర్వహించాం. ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాలు కూడా రోడ్డుపై నిలబడకుండా దృష్టి సారిస్తాం. పార్కింగ్ అంశంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే జరిమానాలు విధిస్తాం.

– ఎం. రమేష్, డీఎస్పీ, ట్రాఫిక్

మీరే ఆక్రమిస్తే... ఎలా...?

ఈస్ట్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో స్టేషన్ ముందే రికవరీ వెహికల్ పెట్టుకోవటం కోసం అధికారులు బ్యారికేడ్లుతో రోడ్డును ఆక్రమించేశారు. అటుగా వెళ్లే ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ బస్సులు, భారీ వాహనాలు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద టర్నింగ్ తీసుకునేటప్పుడు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.



కారుకు లాక్ వేస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

పేదలకు పెన్షన్లు పంపిణీ



పేదలకు పెన్షన్ అందజేస్తున్న అతిథులు, అవోపా ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసిసోయేషన్(అవోపా) కార్యాలయంలో ఆదివారం 108 మంది పేదలకు రూ.500 చొప్పున నెలవారీ పెన్షన్, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణుడు చింతా రామకృష్ణ, ప్రతి నెలా నిర్వహిస్తున్న పెన్షన్ పథకానికి రూ.54వేలు విరాళంగా అందజేశారు. చీరాల అవోపా అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి నెల రూ.500 చొప్పున 108 మందికి పెన్షన్‌తో పాటు రూ.వెయ్యి విలువగల నిత్యావసరాలు పంపిణీ చేసి, వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. 35వ డివిజన్ కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు దానగుణానికి మారుపేరు అని, అవోపా ద్వారా విద్య, వైద్య సేవలతో పాటు ప్రతివారం గో సేవ, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, అవోపా గుంటూరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కేవీ బ్రహ్మం, రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్, వెంకట్రావు, ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు కేటాయించిన స్థలం పరిశీలన



జీజీహెచ్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధి కాకుమానువారితోటలో ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు కేటాయించిన స్థలాన్ని మూడు రోజుల్లో సమగ్ర సర్వే చేసి బౌండరీలు ఫిక్స్ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఆదివారం కమిషనర్ కాకుమానువారితోటలోని స్థలాన్ని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, కేంద్ర ప్రభుత్వ పరిశీలకులు డాక్టర్ రమేష్, జీఎంసీ, సీపీడీసీఎల్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలసి పరిశీలించారు. తొలుత మ్యాప్ ద్వారా మొత్తం ఎంత స్థలం, అందులో ఎంత స్థలం జీజీహెచ్‌కి కేటాయింపు జరిగింది, ప్రస్తుతం స్థలం ఎలా ఉంది పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాకుమానువారితోటలో ప్రభుత్వ వైద్యశాలకు కేటాయించిన ఆరు ఎకరాల స్థలంలో ప్రస్తుతం కొంత ఆక్రమణలు జరగడం, పిచ్చి మొక్కలు పెరిగి ఉందన్నారు. రాబోయే మూడు రోజుల్లో జీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారుల నేతృత్వంలో సర్వేయర్లు సదరు స్థలాన్ని సమగ్రంగా సర్వే చేసి, బౌండరీలు ఫిక్స్ చేయాలని ఆదేశించారు. బౌండరీలు ఫిక్స్ చేసిన అనంతరం ఆక్రమణలను, పిచ్చి మొక్కలను తొలగించేందుకు జాయింట్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులకు సూచించారు. సదరు స్థలంలో భవిష్యత్‌లో ఆక్రమణలు జరగకుండా జీజీహెచ్ సుమారు రూ.90 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు ప్రభుత్వ వైద్యశాలకు కేటాయించిన స్థలంలో ప్రజారోగ్య కార్మికులు, చుట్టుపక్కల నివాసితులు వ్యర్థాలు, చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఇన్నర్ రింగ్ రోడ్‌లో ఓసీ(ఆక్యుపెన్సీ సర్టిఫికేట్) కోసం దరఖాస్తు చేసుకున్న బహుళ అంతస్తుల భవనాలను పరిశీలించి, నిబంధనల మేరకు నిర్మాణాలు జరగాలని, ర్యాంప్‌లు రోడ్ మీదకు రాకూడదని, సెట్ బ్యాక్‌లో జనరేటర్లు, ఇతర అడ్డంకులు ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, బయాలజిస్ట్ మధుసూదన్, ఎంహెచ్‌ఓ రామారావు, ఈఈ కోటేశ్వరరావు, సీపీడీసీఎల్ ఈఈ శ్రీనివాసబాబు, ఏసీపీ ఫజులూర్ రెహ్మాన్ పాల్గొన్నారు.

కారు, ఆటో ఢీకొని.. ఐదుగురికి గాయాలు

చేబ్రోలు: నిమ్మకాయల లోడ్‌తో వెళ్తున్న ఆటోను ప్రమాదవశాత్తూ వెనుక నుంచి కారు ఢీ కొట్టడంతో ఐదుగురికి గాయాలైన ఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. సంగం జాగర్లమూడి, వడ్లమూడి గరువుపాలెం ప్రాంతాలకు చెందిన నిమ్మకాయల వ్యాపారులు నిమ్మకాయల బస్తాలను తీసుకొని ఆటోలో గుంటూరు బయలుదేరారు. మార్గమధ్యలో చేబ్రోలు మండల పరిధిలోని నారాకోడూరు గ్రామ శివారులో ముందు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వచ్చిన కారు బలంగా ఆటోను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న సంగం జాగర్లమూడికి చెందిన గోపి, సాంబ్రాజ్యం, గరువుపాలేనికి చెందిన అనూషలతో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కాళ్లు, చేతులు విరిగిన బాధితులను చేబ్రోలు, వట్టిచెరుకూరులకు చెందిన 108 వాహనాల ద్వారా వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చేబ్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయాలి

పొన్నూరు: ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలలో మొదటిదైన మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం పథకాన్ని వెంటనే అమలు చేయాలని గుంటూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చిలకా విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పొన్నూరు ఇన్‌చార్జి జక్కా రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో ఆదివారం కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిపై కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు.

ఖాతాదారుల ఉన్నతికి యూబీఐ కృషి



కొరిటిపాడు(గుంటూరు): ఖాతాదారుల ఉన్నతికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) కృషి చేస్తోందని ఆ బ్యాంక్ రీజనల్ హెడ్స్ అశ్వర్థనాయక్, రాజేష్ తెలిపారు. జీటీ రోడ్‌లోని యూబీఐ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం రిటైల్ లోన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాతాదారుల ప్రయోజనాలే లక్ష్యంగా సేవలందిస్తున్నామని చెప్పారు. లబ్ధిదారులకు రూ.40 లక్షల వరకు కొల్టేటరల్ లేని స్వదేశీ, విదేశీ విద్యా రుణాలను మంజూరు చేసి విద్యార్థులకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రిటైల్ లోను పాయింట్ హెడ్ డీవీ రామాంజనేయకుమార్ పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహం ధ్వంసంపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న హిందూ సంఘాల నాయకులు

నగరంపాలెం: సికింద్రాబాద్‌లో హిందువులపై లాఠీ ఛార్జిను నిరసిస్తూ గ్లోబల్ హిందూ హెరిటేజ్, హిందూ సంఘాలు, బీజేపీ కార్యకర్తలు ఆదివారం రాత్రి నిరసన తెలిపారు. శంకర్‌విలాస్ కూడలి నుంచి అమరావతి రోడ్డులోని వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం హిందూ సంఘాల నాయకులు మాట్లాడుతూ సికింద్రాబాద్ నగరంలో కొలువైన ముత్యాలమ్మతల్లి దేవస్థానంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి అంటూ హిందువులు నిరసన వ్యక్తం చేశారని అన్నారు. ఈ క్రమంలో హిందువులపై రాష్ట్ర ప్రభుత్వం అమానుషంగా లాఠీఛార్జి జరపగా, పలువురు గాయపడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం తక్షణమే హిందువులకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమ్మవారి విగ్రహాన్ని కాలితో ధ్వంసం చేసిన వ్యక్తిపై చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో చల్లా బ్రహ్మారెడ్డి, తుంగ యశ్వంత్, కె.హర్ష, తూనుగుంట్ల రాజేష్, సాయి, ప్రవీణ్, లక్ష్మి పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



వైద్యశిబిరంలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని గోరంట్ల గ్రామం ఇన్నర్ రింగ్‌రోడ్డు సమీపంలోని శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి చీఫ్ డాక్టర్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం ఎంతో పురాతనమైందని అమ్మవంటిదని తెలిపారు. దీని వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా సంపూర్ణంగా మూలాలతో సహా వ్యాధులు నయం చేస్తుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్దదైన 120 పడకలతో ఆయుర్వేద వైద్యశాలను గుంటూరు నగరంలో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి, డాక్టర్ కశ్యప్, డాక్టర్ రాహుల్, డాక్టర్ ప్రణవి, డాక్టర్ ఐశ్వర్య, మల్లేశ్వరి, కేరళ పంచకర్మిష్టులు పాల్గొన్నారు.